క్లుప్తంగా

సమయపాలన తప్పక పాటించాలి



పాన్‌గల్: ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పక సమయపాలన పాటిస్తూ ప్రార్థనకు హాజరుకావాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి భగత్‌సింగ్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



మదనాపురం: సామాజిక విజ్ఞాన కళాశాల, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన బీఎస్సీ డిగ్రీ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా నెలివిడిలో ప్రజలకు మంగళవారం మెరుగైన ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రక్తహీనత వలన కలిగే అనర్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు రసజ్ఞ, చరణ్య, మేఘన, రచన, సుష్మ, గీత, పావని, మోహిని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి పునరావాస కేంద్రంలో 18ఏళ్లు నిండిన యువతకు ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లలో గ్రామానికి చెందిన కొందరు మట్టి వ్యాపారులు మట్టిని ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ట్రాక్టర్లను అడ్డుకుని రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. మండలంలో మట్టి, ఇసుక అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి హెచ్చరించారు.

అంబులెన్స్‌లోనే ప్రసవం



పాన్‌గల్: అంబులెన్స్‌లో ప్రసవం జరిగిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాగాపూర్‌కు చెందిన గర్భిణి పద్మకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వనపర్తి అంబులెన్స్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అంబులెన్స్ గ్రామానికి చేరుకొని గర్భిణిని పాన్‌గల్ పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికం కావడంతో ఈఎన్‌టీ శశి, పైలెట్ మహేష్ ప్రసవం చేశారు. ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు. సకాలంలో అంబులెన్స్ గ్రామానికి చేరుకొని కాన్పుకు సహకరించిన అంబులెన్స్ సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విటమిన్ 'ఏ'తో రోగ నిరోధక శక్తి

అమరచింత: తొమ్మిది నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు విటమిన్–ఏ ద్రావణం అందించడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తిపుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులకు మంగళవారం విటమిన్ ఏ ద్రావణం అందించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ సురేందర్‌గౌడ్, ఏఎన్‌ఎం నర్సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెంపొందించేందుకు విటమిన్–ఏ ద్రావణాన్ని తాగించాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అన్నారంతండా అంగన్‌వాడీ కేంద్రంలో 9 నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు విటమిన్–ఏ ద్రావణాన్ని తాగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, సంతోషమ్మ, అలివేలు, యాదమ్మ ఉన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మంగళవారం రోడ్లను శుభ్రం చేయడం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు.

పల్లెపాలనలో 'ప్రత్యేకత' కనిపించేనా!

- ఒక అధికారి.. నాలుగైదు బాధ్యతలు
- సమస్యలపై దృష్టిసారించాలంటున్న గ్రామస్తులు
- పెండింగ్ బిల్లులు చెల్లించాలంటున్న మాజీ సర్పంచ్‌లు



గోప్లాపూర్‌లో తాగునీటి ట్యాంకు శుద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ (ఫైల్)

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ప్రత్యేక పాలనలో నాన్ గెజిటెడ్ అధికారులను జాబితా నుంచి తొలగించారు. గెజిటెడ్ అధికారులు సరిపడా లేకపోవడంతో ఒక్కో అధికారికి మూడు, నాలుగు గ్రామ పంచాయతీల పాలనా బాధ్యతలు అప్పగించారు. కొన్ని మండలాల్లో ఐదు గ్రామ పంచాయతీలు సైతం కేటాయించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు 8 మంది ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు.

పని ఒత్తిడి

పార్లమెంట్ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ఎన్నికల నిర్వహణలో ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర గెజిటెడ్ అధికారులకు భాగస్వామ్యం తప్పనిసరి కానుంది. గెజిటెడ్ హోదాలో ఇప్పటికే సొంత శాఖలో చేయాల్సిన విధులతో పాటు అదనంగా మరో మూడు, నాల్గు పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు కట్టబెట్టడంతో పని భారం పెరుగుతుందని కొందరు అధికారులు వాపోతున్నారు. ఒక్కొక్క అధికారికి నాలుగైదు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో అన్నింటిని సందర్శించేందుకు సమయం లేకపోవడంతో వారు ఫోన్లలోనే పంచాయతీ సిబ్బందికి పనులు కేటాయిస్తున్నారు.

కొందరిలో సందేహాలు

సర్పంచుల పదవీకాలం ముగియడంతో తమ పాలన కాలంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు అవుతాయా.. లేదా అనే మీమాంసలో మాజీ సర్పంచ్‌లు ఉన్నారు. ఆరు నెలల నుంచి పంచాయతీలకు నిధులు రాకపోవడంతో సర్పంచులే చేతి నుంచి సొంత నిధులు వెచ్చించారు. ఒక్కొక్క సర్పంచ్‌కు రూ. 3 నుంచి రూ.5 లక్షల వరకు నిధులు అందాల్సి ఉంది. పెద్ద పంచాయతీల్లో అయితే ఈ భారం ఇంకా అధికంగానే ఉంది. ప్రత్యేక అధికారులకు, కార్యదర్శికి సంయుక్తంగా చెక్‌పవర్ ఉండటంతో నిధుల ఖర్చు, గతంలో పనులకు చెల్లించాల్సిన నిధుల గురించి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మండలాల వారీగా పంచాయతీలు, ప్రత్యేక అధికారుల వివరాలు

మండలం	పంచాయతీలు	ప్రత్యేక అధికారులు
పాన్‌గల్	28	08
చిన్నంబావి	17	05
వీపనగండ్ల	14	06

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



గ్రామాలభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేసి ఇబ్బందులు తొలగించాలి. పదవీలో ఉన్న సమయంలో బిల్లులు త్వరగా వస్తాయనే నమ్మకంతో రూ.లక్షలు అప్పులు చేసి పనులు చేశాం. పదవీ కాలం పూర్తయ్యే వరకు కూడా బిల్లులు విడుదల కాకపోవడంతో వడ్డీలు కట్టలేని స్థితిలో ఉన్నాం.

– విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్, గోపల్‌దిన్నె, వీపనగండ్ల (మం)

సమస్యల పరిష్కారానికి..



ప్రత్యేక అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలి. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలి. ప్రభుత్వం నిర్వహిస్తున్న పారిశుద్ధ్య వారోత్సవాలు మండలంలో చాలా గ్రామాల్లో తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

– బాల్యనాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు, తెల్లరాళ్లపల్లితండా

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



మండలంలోని జీపీల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తున్నాం. ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలపై ఆరా తీస్తూ.. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కొక్క అధికారికి రెండు, మూడు గ్రామాలు ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పల్లెల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తూ రోజు కార్యక్రమాలను తప్పక నిర్వహిస్తున్నాం. పెండింగ్ బిల్లుల వివరాలను మరోమారు జిల్లా అధికారులకు నివేదిస్తాం.

– రఘురాములు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, పాన్‌గల్

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే పోటీలు

వనపర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించేందుకు స్పెల్ విజార్డ్, డ్రామా కాంపిటీషన్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించినట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. ఈ మేరకు ఈఎల్‌టీఏ (ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా కాంపిటీషన్స్‌కు 14 మండలాల విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. రెసిడెన్షియల్ విభాగం స్పెల్ విజార్డ్‌లో విజేత యామిని, కేజీబీవీ రేవల్లి, డ్రామా కాంపిటీషన్‌లో సైతం కేజీబీవీ రేవల్లి విద్యార్థి గెలుపొందారని, నాన్ రెసిడెన్షియల్ విభాగం స్పెల్ విజార్డ్‌లో ఠాగూర్ నాయుడు, జెడ్పీహెచ్‌ఎస్ దుప్పల్లి, డ్రామా కాంపిటీషన్‌లో జెడ్పీహెచ్‌ఎస్ చెన్నారం, రేవల్లి మండలం విద్యార్థి విజేతగా నిలిచినట్లు వెల్లడించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు యుగంధర్, మహానంది, డీసీఈబీ సెక్రెటరీ చంద్రశేఖర్, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, ఈఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి సీజీ విష్ణువర్ధన్, అరవింద్, జ్యోతి, రాజు, రమేష్, రాజు గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రయోగ పరీక్షలు

వనపర్తి టౌన్: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థుల ప్రయోగ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం జరిగిన పరీక్షకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 505 మందికిగాను 487 మంది హాజరుకాగా.. 18 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 443 మందిగాను 433 మంది విద్యార్థులు హాజరుకాగా.. 10 మంది రాలేదు

అందరి తోడ్పాటుతోనే అభివృద్ధి



కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: స్థానికంగా విధులు నిర్వర్తించే సమయంలో నాయకులు, అధికారులు, సిబ్బంది తోడ్పాటు మరువలేనిదని, ఈ ప్రాంతాన్ని ఎన్నటికీ మరువలేనని వనపర్తి కమిషనర్ విక్రమసింహారెడ్డి అన్నారు. బదిలీపై వెళ్లనున్న కమిషనర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల నుంచి మొదలుకొని అన్ని విభాగాల్లో అధికారుల సమన్వయంతోనే మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించామని తెలిపారు. వివాదాలకు దూరంగా ఉంటూ విధి నిర్వహణలో తనదైన ముద్ర వేశారని బీఆర్‌ఎస్ నాయకులు గులాం ఖాదర్ ఖాన్, ఎర్ర శ్రీను అన్నారు. అనంతరం అధికారులు సైతం సన్మానించారు.

నీటికుంటలో పడి గొర్రెలు మృతి

కొత్తకోట రూరల్: నీళ్లు తాగేందుకు వెళ్లిన గొర్రెలు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని కనిమెట్ట శివారులో గల కర్ణవానికుంటలో చోటు చేసుకుంది. కనిమెట్ట గ్రామానికి చెందిన నాగన్నయాదవ్ తన గొర్రెలను రోజువారి మాదిరిగానే మేతకు తీసుకెళ్లాడు. నీళ్లు తాగించేందుకు కనిమెట్ట శివారులో గల కర్ణవాని కుంటకు వెళ్లగా.. గొర్రెలు ఒకదానికొకటి తోసుకోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో పడి ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రోజు గొర్రెలను కాస్తూ వాటిపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్న తనకు రూ.80వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని నాగన్నయాదవ్ కోరాడు.

కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేద్దాం



నియామక పత్రం అందిస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్ అన్నారు. మండలంలోని అప్పరాల, భూత్కూర్, రామనంతాపురం గ్రామాల్లో మంగళవారం పార్టీ అధ్యక్షుడు మండల బీచుపల్లి యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా బోయేజ్ మాట్లాడుతూ సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిసేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రావుల జితేంద్రనాథ్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, మాసన్న, రమేష్, బంగారయ్య, ఎస్. రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గురుకుల లైబ్రేరియన్‌గా ఎంపిక



కొత్తకోట: ఇటీవల వెలువడిన గురుకుల లైబ్రరియన్ ఫలితాల్లో పట్టణ కేంద్రానికి చెందిన ఈగపూరి శ్రీనివాస్‌రెడ్డి అర్హత సాధించాడు. శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం మండలంలోని రామనంతాపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. తోటి ఉద్యోగి గురుకుల లైబ్రేరియన్‌గా ఎంపిక కావడంతో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్‌లోనూ అర్హత సాధించాడు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్ –1లో విజయం సాధించడమే తన లక్ష్యమన్నాడు.

సాగునీటి కాల్వల పరిశీలన



డీ–8 కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించే కాల్వలను మంగళవారం అధికారులు పరిశీలించారు. భూసేకరణ శాఖ అధికారి నాగరాజు, హార్టికల్చర్ శాఖ అధికారి శ్రీకాంత్, డీఐ సర్వేయర్ అహ్మద్, కాల్వ పనులు చేపట్టిన ఏజెన్సీ ప్రతినిధి రాజశేఖర్ కాల్వలను పరిశీలించారు. కమాలోద్దీన్‌పూర్ ప్రధాన కాల్వ నుంచి సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి గ్రామాలకు సాగు నీరు అందించే మైనర్ కాలువ 2.7 కిలోమీటర్లు, ఖిల్లాఘనపురం బ్రాంచ్ కెనాల్ నుంచి మానాజీపేట శివారులోని డీ–8 కాల్వ 8 కిలోమీటర్ల పొడవు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. కాల్వ తీసిన ప్రాంతంలో బోరుబావులు, టేకు, చింత, వేప లాంటి పెద్ద చెట్లు, పైపు లైన్లు ఉన్న సర్వేనెంబర్లను గుర్తించామని పేర్కొన్నారు. రైతులకు భూమికి అందించే పరిహారంతో పాటుగా ఇలాంటివి ఉంటే ప్రభుత్వం అదనంగా పరిహారం చెల్లిస్తుందన్నారు. పూర్తి వివరాలతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారుల పంపిస్తామని తెలిపారు. కాల్వ తీసిన సమయంలో ఉన్న రైతులు ఎవరైనా వేరేవారికి భూమిని విక్రయించినట్లయితే ఆ వివరాలతో భూమిని కొనుగోలు చేసిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు రైతులకు వివరించారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి



పెబ్బేరు రూరల్: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని జీసీడీఓ శుభలక్ష్మి అన్నారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందించే భోజనం, స్టాక్‌రూం, పాఠశాల ఆవరణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, డీఎంహెచ్‌ఓ జయచంద్రమోహన్, మండల వైద్య అధికారి రాముడు హాజరయ్యారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందించాలని, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండల పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ వాణి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

పెబ్బేరు రూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రజలంతా ఏకం కావాలని జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ పిలుపునిచ్చారు. జిల్లా సీపీఎం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులతో మంగళవారం జబ్బార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో ప్రజల జీవన ప్రమాణం దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండ్లరాజు, పరమేశ్వరాచారి, నందిమల్ల రాములు, రాబర్ట్, మేకల ఆంజనేయులు, కురుమయ్య, రమేష్, మునిరోద్దీన్, గంధం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జములేశ్వరి దేవత ఉత్సవాలు



దాసంగాలు సమర్పిస్తున్న భక్తులు

అమరచింత: పట్టణ శివారులో వెలసిన జములమ్మ దేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. జోకలే.. జోక అన్న పూనకాలతో శివసత్తుల భక్తితో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పోటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. నూతనంగా అమ్మవారి పాదాలను కట్టుకుంటున్న జంటలకు వారి బంధువులు కొత్త బట్టలను పెట్టి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా మున్సిపాలిటీ అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించారని ఆలయ అధ్యక్షుడు మంగలి నరసింహులు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



అమరచింతలో..



చిక్కేపల్లిలో..

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు బోధించిన విషయాలను తెలుసుకుని జ్ఞానాన్ని పెంచుకొనే విద్యార్థులే స్వయంగా ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా బోధించారని హెచ్‌ఎం బలరాముడు అన్నారు. ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయురాలిగా శృతి, డీఈఓగా చార్లెస్, కలెక్టర్‌గా గణేష్‌తో పాటు 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయ పాత్రను పోషించారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తమకు కేటాయించిన తరగతి గదుల్లోకి వెళ్లి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. కలెక్టర్‌గా నవ్యశ్రీ, డీఈఓగా వి.మౌనిక, ఎంఈఓగా సంధ్య, హెచ్‌ఎంగా నందినితో పాటు 30మంది విద్యార్థులు టీచర్లుగా పాఠాలు చెప్పారు.

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా రాఘవేంద్ర, డిప్యూటీ కలెక్టర్‌గా ఏ.శివకుమార్, డీఈఓగా ఎం.శివకుమార్, ఎంఈఓగా పి.కార్తీక్, హెచ్‌ఎంగా కె.కార్తీక్‌తో పాటు 11 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందం బాలస్వామి, రామచంద్రయ్య, కేశవులు, రమేష్, చంద్రకాంత్, విద్యావాలంటీర్ రవి ఉన్నారు.

విధి నిర్వహణలో నిబద్ధత అవసరం

వీపనగండ్ల: ఇటీవల వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని గోపల్‌దిన్నెకు చెందిన మిట్టకడుపుల భాస్కర్, మిట్టకడుపుల శివకుమార్ ఉద్యోగాలను సంపాదించారు. వారిని మంగళవారం గ్రామంలోని వివిధ ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, గ్రామస్తులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి విక్రం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, డీలర్ సింగయ్య, ఎల్లస్వామి, కుర్మయ్య, వెంకటయ్య, బాలగౌడ్ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

స్థానిక ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న నందీకర్‌ను ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, మాజీ సర్పంచ్‌లు గంగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి రఘునాథ్‌రెడ్డి, రాంబాబు, బస్వరాజ్‌గౌడ్, కుమ్మరి ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న డి.పూజిత జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి తెలిపారు. ఈ నెల 15న గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో గల సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో నిర్వహించే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మన రాష్ట్రం నుంచి పూజిత పాల్గొంటుందన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయస్థాయిలో పాల్గొనేందుకు వెళ్తుండటం సంతోషంగా ఉందని, పూజితను ప్రిన్సిపాల్ మాలతి, పీఈటీ రాజేశ్వరి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పెరిగిన ధరలతో బెంబేలు

గోపాల్‌పేట: దేశంలో పెరిగిన నిత్యావసర ధరలతో పేదల బతుకులు దుర్భరంగా మారాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.అనంతరం బంద్‌కు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, సుధాకర్, బాలాజీ, ప్రవీణ్, వీరబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము అన్నారు. మంగళవారం మండలంలోని దావాజిపల్లి, దొండాయిపల్లి, కొత్తపేట, బుసిరెడ్డిపల్లి గ్రామాలల్లో వారు పర్యటించారు.

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. మంగళవారం మండలంలోని మూలమల్లలో ఉపాధిహామీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కృపాదానం, రత్నం, దావీద్, లక్ష్మమ్మ, చిన్నమ్మ, బుచ్చన్న, కార్మికులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ ర్యాలీ

పెబ్బేరు రూరల్: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం రాత్రి వనపర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పుట్ట ఆంజనేయులు, వెంకటయ్య, శ్రీనివాసులు, బాలస్వామి, రాబర్ట్, నందిమల్ల రాములు, గట్టయ్య, గంధం గట్టయ్య, మద్దిలేటి ఉన్నారు.